క్లుప్తంగా

ముగిసిన మంతాలమ్మ పండగ



అంజలి రథాన్ని తిప్పుతున్న భక్తులు

బాడంగి: మండలంలోని పినపెంకి గ్రామ దేవత మంతాలమ్మ అమ్మవారి పండగ బుధవారంతో ముగిసింది. అమ్మవారి అంజలి రథం తిరువీధి, ఘటాల ఊరేగింపు అనంతరం భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



కొత్తగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

సంతకవిటి: మండలంలోని మేడమిర్తి గ్రామంలో లో వోల్టేజి సమస్యను పరిష్కరించేందుకు సుమారు రూ.3.30 లక్షలతో 16 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను బుధవారం ఏర్పాటు చేశారు. దీంతో గ్రామంలో లో వోల్టేజి సమస్య తీరనుంది. దీని ఏర్పాటులో విజయనగరం రూరల్ ఈఈ జి.సురేష్‌బాబు, రాజాం డీఈఈ బీవీఎస్ ఫణీంద్రకుమార్, సంతకవిటి ఏఈ వినయ్‌కుమార్ చొరవ చూపారు.

పక్కాగా పారిశుధ్య పనులు



పూల్‌బాగ్ వద్ద కాలువల్లో చెత్తను తీయిస్తున్న కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: పట్టణంలోని ప్రధాన మురుగు కాలవల నిర్వహణపై సిబ్బంది దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి సూచించారు. పూల్‌బాగ్, శివాలయం వీధి తదితర ప్రాంతాల్లో బుధవారం క్షేత్ర స్థాయి పర్యటన చేశారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్తను సిబ్బందితో తీయించారు. మురుగు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు శానిటరీ విభాగం చర్యలు చేపట్టాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమె వెంట ఎన్విరాన్‌మెంటు సిబ్బంది, శానిటరీ సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

బొబ్బిలి: పట్టణ పరిధిలోని కోటి చెరువు వద్ద నున్న సబ్‌స్టేషన్‌లో శుక్రవారం మరమ్మతులు చేపడుతున్నందున పట్టణంలోని పలు ప్రాంతాలకు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ అనంతరావు బుధవారం తెలిపారు. నాయుడు కాలనీ, ఆర్టీసీ కాంప్లెక్స్, టీఆర్ కాలనీ, సాయినగర్, స్వామివారి వీధి, చీపురుపల్లి వీధి, కోరాడ వీధి, పూల్‌బాగ్, మహారాణిపేట, కోవెల సెంటర్, మార్కెట్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

సాగునీటి కాలువలో పూడికల తొలగింపు



పారాది ఛానల్‌లో పూడికలు తొలగిస్తున్న వేతనదారులు

బొబ్బిలి: మండలంలోని పారాది ఆనకట్ట కింద ఉన్న శివారు ఆయకట్టు రైతులకు సాగునీటి అందించేందుకు పారాది చానల్‌లో పూడికలను తొలగిస్తున్నారు. ఉపాధి హామీ పథకంలో పెంట గ్రామానికి చెందిన వేతనదారులు గత కొద్ది రోజులుగా పారాది నుంచి పెంట గ్రామం వరకు ఉన్న ప్రధాన కాలువలోని పూడికలను తొలగిస్తున్నారు. దీంతో రానున్న ఖరీఫ్‌కు సాగునీటికి ఇబ్బందులు కలగకపోవచ్చని శివారు గ్రామ ఆయకట్టు రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

తాగునీరు వృథా..!



పైపుల ద్వారా వృథాగా పోతున్న తాగునీరు

వంగర: మండల పరిధి ఎం.సీతారాంపురం గ్రామం సాపరాయగుడి వీధిలో తాగునీటి పైప్‌లైన్ లీకవుతోంది. గత కొన్ని నెలలుగా పైప్‌లైన్ పాడవడంతో నీరు వృథాగా పోతోంది. దీంతో జనావాసాల మధ్య నీరు నిల్వ ఉండి బురదమయంగా మారింది. ప్రజలకు అందాల్సిన తాగునీరు వృథాగా పోతోందని, అధికారులు స్పందించి పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టి లీకులను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వం దృష్టికి చెరకు రైతుల సమస్యలు

• ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

రేగిడి: ఈ ప్రాంత చెరకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. బుధవారం రేగిడి వచ్చిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. సంకిలి ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారం పరిధిలో చెరకు విస్తీర్ణం గణనీయంగా తగ్గుముఖం పట్టిందన్నారు. ప్రభుత్వం నుంచి చెరకు పంట సాగు చేసే రైతులకు సరైన ప్రోత్సాహం లేకపోవడం వలనే సాగు తగ్గిందని, ఈ విషయాన్ని నేరుగా రైతుల నుంచే తెలుసుకున్నామని చెప్పారు. కర్మాగారం మూతపడకుండా తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సుగర్ కేన్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేయనున్నామని ఎమ్మెల్సీ పేర్కొన్నారు. చెరకు సాగు విస్తీర్ణం పెరగాలంటే రైతులకు మద్దతు ధర ముఖ్యమని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన 10.25 రికవరీ శాతం ఆధారంగా టన్నుకు రూ.3550లు ధర ప్రకటించిందన్నారు. సాగుకు పెరిగిన ఖర్చులు రీత్యా రైతుకు ఇది గిట్టుబాటు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం టన్ను చెరకుకు రూ.5వేలు ఉంటే రైతు పంటను సాగు చేసేందుకు ఆసక్తి కనబరుస్తారని పేర్కొన్నారు. చెరకు పంట టన్నుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.500లు సలహాధర ఇవ్వాలని అన్నారు. సబ్సిడీతో కూడిన యాంత్రీకరణ పనిముట్లు సరఫరా చేయాలని వివరించారు. వ్యవసాయానికి ప్రధానంగా చెరకు పంటతో రైతుకు ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. ఉపాధి హామీ పథకాన్ని చెరకు పంటకు అనుసంధానం చేస్తే రైతుకు కొంత లాభదాయకంగా ఉంటుందని వివరించారు. చక్కెర పరిశ్రమ దేశ వ్యాప్తంగా సంక్షోభంలో ఉందని, దక్షిణ భారతదేశంలో పరిస్థితి మరీ దారుణంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు మద్దతు ధర ఇచ్చిన చోట కర్మాగారాలు పని చేస్తున్నాయని వెల్లడించారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో ఫ్యాక్టరీలు అన్నీ మూతపడుతున్నాయని అన్నారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాకు చెందిన కింజరాపు అచ్చెన్నాయుడు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్నందున చక్కెర కర్మాగారం మూతపడకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ కోరారు. సమావేశంలో చెరకు రైతుల సంఘం ప్రతినిధి కింజరాపు సురేష్ కుమార్, అప్పాపురం, లక్ష్మీపురం సర్పంచ్‌లు కరణం శ్రీనివాసరావు, కెంబూరు వెంకటేశ్వరరావు ఉన్నారు.

కూటమి పాలనలో నిర్వీర్యమవుతున్న వ్యవస్థలు



మాట్లాడుతున్న కన్వీనర్ లక్ష్మన్నాయుడు

బొబ్బిలి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి వ్యవస్థలన్నీ నిర్వీర్యం అవుతున్నాయని, రాజధాని అమరావతి పేరుతో వెనుకబడిన జిల్లాలను మరింత వెనుకబాటుకు గురి చేస్తున్నారని ఉత్తరాంధ్ర సాధన సమితి కన్వీనర్ వేమిరెడ్డి లక్ష్మన్నాయుడు ధ్వజమెత్తారు. తన కార్యాలయంలో విలేకరులతో బుధవారం మాట్లాడారు. పోలీసు, రెవెన్యూ, విద్య, వైద్య రంగాలన్నింటిని అధోగతి పాలు చేస్తున్నారని ఆయా శాఖల్లో పని చేస్తున్న అధికారులను తమ సొంత పనులకు వినియోగించుకుంటున్నారని విమర్శించారు. ముఖ్యంగా పోలీసులు, రెవెన్యూ శాఖలను మరింత దిగజార్చుతున్నారని, సామాన్యులకు న్యాయం జరిగే పరిస్థితులు కానరావడం లేదని ఆరోపించారు. రాజధాని పేరుతో ఇబ్బడిముబ్బడిగా అప్పులు చేస్తు వెనుబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు తీరని ద్రోహం చేస్తున్నారని వెల్లడించారు. సాగునీటి రంగాన్ని గాలికొదిలారని, నిత్యవసరాల ధరల నియంత్రణలో ప్రభుత్వం చర్యలు శూన్యమన్నారు. ఇలాగే పాలన సాగితే ప్రాంతీయ విభేదాలతో రాయలసీమ, ఉత్తరాంధ్రలను వేరుపడే రోజులు ఎంతో దూరంలో లేవన్నారు. ఇప్పటికైనా వ్యవస్థలను తమ సొంత జాగీరు పనులకు కాకుండా ప్రజలకు సేవచేసేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రెడ్డి సత్యంనాయుడు, సన్యాసిరావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గంటలు పని చేస్తే రూ.307ల వేతనం



వేతనదారులతో మాట్లాడుతున్న ఏపీవో హరనాథరావు

రేగిడి: ఉపాధి హామీ పనుల్లో వేతనదారులు ఆరుగంటల కాలం పని చేస్తే రూ.307లు వేతనం వస్తుందని ఏపీవో ఎస్.హరనాథరావు వేతనదారులకు సూచించారు. మండల పరిధిలోని లచ్చారాయపురం పంచాయతీ పరిధి వెంకటరంగారాయపురంలో మునికోటివాని చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేస్తే వేతనం గిట్టుబాటు అవుతుందన్నారు. రెండు పూటలా పని చేయాలని అన్నారు. అనంతరం వేతనదారుల మస్టర్ తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఏ వెంకటరమణ, మేట్‌లు పాల్గొన్నారు.

యోగాపై విద్యార్థులకు పోటీలు



వంగర: మాట్లాడుతున్న ఎంపీడీవో రఘునాథాచారి

వంగర: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు వ్యాసరచన, వృకృత్వ పోటీలు నిర్వహించాలని ఎంపీడీవో ఎస్.రఘునాథాచారి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో బుధవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. యోగాపై ప్రజల్లో అవగాహన పెంచాలని, ఎక్కువ మంది యోగాసనాల్లో పాల్గొనేలా రిజిస్ట్రేషన్లు చేయాలన్నారు. వెలుగు, ఎంజీఎన్‌ఆర్‌ఈజీఈఎస్ శాఖల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ దిరిశాల ధర్మరాజు, ఏఎస్ఐ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

తెర్లాం: యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని స్థానిక శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి అన్నారు. యోగా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు యోగాసనాలను నేర్పించే కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యార్థులు చదువుతోపాటు యోగాసనాలపై దృష్టి సారించాలని ఆయన కోరారు.

ఆర్టీసీలో రద్దీ



బస్సు ఎక్కేందుకు పోటీపడుతున్న బొబ్బిలి వైపు వెళ్లే ప్రయాణికులు

రామభద్రపురం: సాలూరు శ్యామలాంబ పండగ ముగియడంతో భక్తులు తిరుగు ప్రయాణమయ్యారు. దీంతో మండల కేంద్రంలో ఆర్టీసీ బస్సుల వద్ద రద్దీ నెలకొంది. 15 సంవత్సరాల తరువాత పండగ జరగడంతో సుదూర ప్రాంతాల నుంచి కుటుంబ సభ్యులు, స్నేహితులు బంధువులు సాలూరు పండగకు వెళ్లారు. మంగళవారంతో పండగ ముగియడంతో బుధవారం తిరుగు ప్రయాణం అయ్యారు. ఈ క్రమంలో రామభద్రపురం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణం ప్రయాణికులతో రద్దీ నెలకొంది. ఆటోలు కూడా రద్దీగా మారాయి. తగినన్ని ఆర్టీసీ సర్వీసులు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

సేంద్రియ ఎరువుల తయారీ



గోపాలరాయుడుపేటలో ఎస్‌డబ్ల్యూపీసీలో సేంద్రియ ఎరువుల తయారీ

బొబ్బిలి రూరల్: మండలంలోని పారాది, గోపాలరాయుడుపేట, జగన్నాథపురం తదితర గ్రామాల్లో సేంద్రియ ఎరువుల తయారీ ప్రక్రియను ప్రారంభించారు. చెత్త నుంచి ఎరువులను తయారు చేసి రైతులకు చౌక ధరల్లో అందించడం, వాటి ప్రాముఖ్యతపై రైతులకు అవగాహన కల్పించడంలో పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన కార్యక్రమాలు సత్ఫలితాలు ఇస్తోంది. దీంతో రానున్న ఖరీఫ్ లో రైతులకు సేంద్రియ ఎరువుల వినియోగం పెంచే విధంగా కార్యదర్శులు సమాయత్తమవుతున్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం



ప్రత్యేకాలంకరణలో సీతారాములు

విజయనగరం టౌన్: నవమి పురస్కరించుకుని, స్థానిక సిటీ బస్టాండ్ వద్ద ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయంలో శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు గాయత్రీ శర్మ ఆధ్వర్యంలో ఉదయం స్వామి కల్యాణం జరగ్గా, సాయంత్రం లక్ష సింధూరార్చన చేశారు. గురువారం హనుమాన్ జయంతి సందర్భంగా వేకువజాము నుంచే స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడు కోవెళ్ల మారుతీ దీక్షా పీఠంలో స్వామిదీక్షలు తీసుకున్న స్వాములతో అభిషేకాలు, లక్ష రుద్రాక్ష పూజలు, హనుమాన్ చాలీసా పఠనం, హోమాలు వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు.

నవధాన్యాల సాగుపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రేగిడి: ఖరీఫ్‌లో పంట పొలాల్లో సారవంతం కోసం వేయనున్న నవధాన్యాల సాగుపై బుధవారం సోమరాజుపేట గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. మాస్టర్ ట్రైనర్ పద్మ మాట్లాడుతూ భూమి గుల్లబారి భూసారం పెరిగి మొక్కకు కావాల్సిన పోషకాలు సంపూర్ణంగా అందించి దిగుబడులు పెంచేందుకు ఈ నవధాన్యాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. రైతులకు అవసరమైన నవధాన్యాలు కిట్లును అందుబాటులో ఉంచామని వెల్లడించారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు రవి, వరలక్ష్మి, శ్రీదేవి, సురేష్, గౌరీశ్వరరావు, తవిటినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీసీ డ్రైన్ నిర్మాణ పనుల పరిశీలన



సోపేరులో సీసీ డ్రైన్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

రాజాం: మండలంలోని సోపేరు గ్రామంలో రూ.4 లక్షలతో నిర్మిస్తున్న సీసీ డ్రైన్ నిర్మాణాన్ని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు బుధవారం పరిశీలించారు. పీఎంజేజేవైలో భాగంగా ఎస్సీ కాలనీలో ఈ డ్రైన్ నిర్మాణం చేస్తున్నామని ఎంపీడీవో వెల్లడించారు. అన్ని గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న సీసీ డ్రైన్‌ల నిర్మాణంపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

విధుల్లో సమయపాలన పాటించాలి



కంచరాంలో సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో

రాజాం సిటీ: సచివాలయ సిబ్బంది విధుల్లో సమయపాలన పాటించాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధి బొద్దాం, కంచరాం గ్రామ సచివాలయాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్ సర్వేలను పూర్తి చేయాలన్నారు. తడిపొడి చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

బాడంగిలో వర్షం

బాడంగి: మండలంలో పలుచోట్ల మంగళవారం రాత్రి, బుధవారం మధ్యాహ్నం తేలికపాటి వర్షం కురిసింది. వర్షంతో వాతావరణం చల్లబడడంతో ప్రజలు వేసవి ఉక్కపోత నుంచి ఉపశమనం పొందారు. రైతులు వేసవి దుక్కులకు సిద్ధమయ్యారు.

అరసాడలో పారిశుధ్య పనులు

వంగర: మండల పరిధి అరసాడ గ్రామంలో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నారు. సర్పంచ్ లచ్చుభుక్త సత్యనారాయణ ఆధ్వర్యంలో డ్రైనేజీల్లో మురుగు తొలగించి బ్లీచింగ్ వేయించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు దూరంగా ఉంటాయని సర్పంచ్ తెలిపారు.

తెలుగు భాషా పదజాలంపై అవగాహన

డెంకాడ: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు తెలుగు భాషా పదజాలంపై బుధవారం అవగాహన కల్పించారు. తెలుగులోని కొన్ని పదాలు తెలిపి వాటిని పలికే విధానం, అర్థాలు, రాయడం వంటివి లైబ్రేరియన్ మహేష్ తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు ఉక్తలేఖనం(డిక్టేషన్) పోటీలు నిర్వహించారు.

• తవ్వేశారు.. వదిలేశారు...!



తెర్లాం – బొబ్బిలి ఆర్‌అండ్‌బీ ప్రధాన రోడ్డులో స్థానిక బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ నుంచి కేబుల్ బాగు చేసేందుకు జేసీబీతో రోడ్డు పక్కన గోతులు తవ్వేసి వాటిని పూడ్చకపోవడంతో వాహన చోదకులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కొద్ది రోజుల క్రితం రోడ్డుకు ఓ పక్కన జేసీబీతో కాలువ తవ్వేసి రోడ్డుపై మట్టిని వేశారు. కొన్ని చోట్ల కాలువ కప్పినా ఇటీవల కురిసిన వర్షాలకు మట్టి పూర్తిగా కిందకు దిగిపోయి రోడ్డు బెర్మ్ అంతా గోతులుగా ఏర్పడ్డాయి. దీంతో ఈ రోడ్డుపై వచ్చే వాహనాలు ఒకదానికి ఒకటి తప్పించేటప్పుడు ఇబ్బంది పడుతున్నారు. ఎటువంటి ప్రమాదాలు జరగక ముందే వాటిని పూర్తి స్థాయిలో కప్పి, చదును చేయించేలా చర్యలు తీసుకోవాలని వాహన చోదకులు కోరుతున్నారు. – తెర్లాం

• వేతనదారుల నిరసన



ఉపాధి హామీ పనులకు రెండు పూటలు వెళ్లి పనులు చేసినా గిట్టుబాటు వేతనం ఇవ్వడం లేదని ఉపాధి హామీ వేతనదారులు నిరసన వ్యక్తం చేశారు. రామభద్రపురం మండలం నాగిరెడ్డి బంద వద్ద సీఐటీయూ నాయకుడు బలస శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. రెండు పూటలా పని చేసినా వేతనం గిట్టుబాటు కావడం లేదని నినదించారు. సక్రమంగా బిల్లులు పడడం లేదని దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. – రామభద్రపురం

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి



విద్యార్థులకు మెమెంటోను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

• మాజీ ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: విద్యార్థులు తమ ప్రాథమిక విద్యార్థి దశ నుంచే ఉత్తమ ప్రతిభను కనబర్చుతూ ఉన్నతమైన లక్ష్యాలను అందిపుచ్చుకోవాలని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు ఆకాంక్షించారు. నియోజకవర్గంలో కొప్పుల వెలమ సామాజిక తరగతికి చెందిన పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానాలను సాధించిన విద్యార్థులకు అభినందన సభను కొప్పుల వెలమ సేవా సమితి ఆధ్వర్యంలో వెలమ కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శంబంగి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ గ్రామీణ వాతావరణంలో పెరుగుతూ అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

కృషి, పట్టుదల ఉంటే ఎంతటి సమస్యనైనా సులువుగా సాధించవచ్చన్నారు. అనంతరం ప్రతిభ కనబర్చిన 30 మంది విద్యార్థులకు నగదు బహుమతితో పాటు మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో కొప్పుల వెలమ సేవా సంఘం ప్రతినిధులు, పెద్దలు పాల్గొన్నారు.

ఎండీయూ వాహనదారులను కొనసాగించాలి



తెర్లాం: తహసీల్దార్ హేమంత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎండీయూ ఆపరేటర్లు



బొబ్బిలి రూరల్: తహసీల్దార్ శ్రీనుకు వినతిపత్రం అందజేస్తున్న ఎండీయూ ఆపరేటర్లు

తెర్లాం: పౌర సరఫరాల శాఖలో ఇంటింటికీ బియ్యం, ఇతర సరుకులు పంపిణీ చేస్తున్న తమను ప్రభుత్వం కొనసాగించాలని ఎండీయూ ఆపరేటర్లు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ హేమంత్‌కుమార్‌కు బుధవారం తమను కొనసాగించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తమను ఎండీయూ ఆపరేటర్లుగా నియమించిందన్నారు. నాలుగేళ్లుగా ఎటువంటి లోపాలు లేకుండా ఇంటింటికీ రేషన్ సరుకుల పంపిణీ చేస్తున్నామని తెలిపారు. తమకు 2027 వరకు ఒప్పందం ఉందని, దాని ప్రాప్తికి తమను కొనసాగించాలని ఎండీయూ ఆపరేటర్లు శంకరరావు, గౌరీ, శ్రీను తదితరులు తహసీల్దార్‌ను కోరారు. సమస్యను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని తహసీల్దార్ హేమంత్‌కుమార్ అన్నారు.

రేగిడిలో..

రేగిడి: ఎండీయూ ఆపరేటర్లు బుధవారం రేగిడి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. నిత్యావసర సరుకులను సరఫరాచేసే వాహనాలను ప్రభుత్వం తీసివేయడంతో ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. డీటీ రామారావుకు వినతిపత్రం అందజేశారు. ముందస్తు సమాచారం లేకుండా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం దారుణమని అన్నారు. ఆ సంఘం అధ్యక్షుడు పి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు రామ్మోహనరావు, కె.శ్రీనివాసరావు, అనిల్‌కుమార్, ఎం.కుమార్, కామేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిలో...

బొబ్బిలి రూరల్: నిత్యవసరాలను ప్రజల ఇళ్ల వద్దకే తీసుకువెళ్లి అందించిన తమను ప్రభుత్వం తొలగించడం అన్యాయమని కుటుంబాల పోషణకు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాన్ని చూపి విధుల నుంచి తప్పించాలని ఎండీయూ వాహన ఆపరేటర్లు కోరారు. తహసీల్దార్ శ్రీనుకు వినతిపత్రం అందజేశారు. జూన్ 1వ తేదీ నుంచి తమను విధుల నుంచి తప్పుకోవాలని ప్రభుత్వం ప్రకటించిందని, వీటి పైనే ఆధారపడి జీవిస్తున్న ఆర్థికంగా వెనుకబడిన మాకు మరో మార్గాన్ని చూపి తొలగించేలా ప్రభుత్వం చర్యల చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో ఎండీయూ సమైక్య రేషన్ వెహికల్ ఆపరేటర్లు పాల్గొన్నారు.